ఐడీసీఎంఎస్‌లో మహాజన సభ

మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 27 : జిల్లాకేంద్రంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో 56వ మహాజనసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్‌నాయక్ మాట్లాడుతూ.. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున, గోనె సంచులు షార్టేజీ రాకుండా చూడాలని, రైతులకు రుణమాఫీ వర్తించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు సాయన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో సొసైటీలో..

ధర్పల్లి, సెప్టెంబర్ 27 : మండలకేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, సొసైటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గున్నయ్య, నాయకులు మిట్టాపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, డైరెక్టర్లు శ్రీనివాస్, పోతరాజు పాల్గొన్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని తీర్మానం

మోర్తాడ్, సెప్టెంబర్ 27: సన్నరకంతోపాటు దొడ్డురకం ధాన్యానికీ రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ఇవ్వాలని మోర్తాడ్ సొసైటీలో చైర్మన్ కల్లెం అశోక్ ఆధ్వర్యతన నిర్వహించిన మహాజనసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన మహిపాల్, డీసీసీబీ మేనేజర్ శ్రీనివాస్‌ను సన్మానించారు.కార్యదర్శి కాశీరాం, డీసీసీబీ డైరెక్టర్ భూమన్న, సొసైటీ ఉపాధ్యక్షుడు దడివె నవీన్ పాల్గొన్నారు.

ఇందల్వాయిలో సీఈవోపై రైతుల ఆగ్రహం

ఇందల్వాయి, సెప్టెంబర్ 27 : ఇందల్వాయి సొసైటీ సభను శుక్రవారం నిర్వహించగా.. రసాభాసా చోటుచేసుకున్నది. సీఈవో రతన్‌పై సొసైటీ సంఘ సభ్యులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో, అన్ని వివరాలు సక్రమంగా ఉన్నా రుణమాఫీ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఈవోపై చేస్తున్న ఆరోపణలను పాలకమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. సొసైటీ వైస్‌చైర్మన్ మారుతి, డైరెక్టర్లు దాసు, గంగారెడ్డి, మల్లారెడ్డి, గంగాధర్, గంగామణి, సుధాకర్, ఎన్‌డీసీసీబీ జిల్లా డైరెక్టర్ కోరట్‌పల్లి ఆనంద్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలి

రెంజల్, సెప్టెంబర్ 27:అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రూ.2లక్షల రుణ మాఫీ వర్తింపజేయాలని దూపల్లి సొసైటీ మహాజన సభలో తీర్మానించారు. విండో చైర్మన్ భూమారెడ్డి , సీఈవో జీవన్‌రెడ్డి, డైరెక్టర్లు కాశం సాయిలు, పల్లె సాయిలు, గంగాధర్, ప్రతాప్‌రెడ్డి, గంగారాం, సాయమ్మ, రాంరెడ్డి, దేవిచంద్, రాజ్‌కుమార్, వరలక్ష్మి, గోపాల్‌రెడ్డి,బాబన్న పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకూ రుణాలు

నవీపేట, సెప్టెంబర్ 27: సహకార సంఘం ద్వారా ఇక నుంచి అసైన్డ్ భూములకూ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు నవీపేట మండలం నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేశ్‌కుమార్ పేర్కొన్నారు. నాగేపూర్ సహకార సంఘం మహాజన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ నుంచి 800కు పైగా రైతులపేర్లు పంపగా 215 మందికే మాఫీ వచ్చిందని అన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన వరంగల్ జిల్లా రైతులు

ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్27: మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని వరంగల్ జిల్లా రైతులు శుక్రవారం సందర్శించారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, నాబార్డు వారి ఆర్థిక సహాయంతో 50 మంది రైతులు గ్రామాన్ని సందర్శించారు. పసుపు, సోయాబీన్‌తోపాటు ఇతర పంటల సాగు విధానాన్ని పరిశీలించారు. పసుపులో తెగుళ్ల నివారణ, సస్య రక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. దిగుబడులు సాధించేందుకు అంకాపూర్ రైతులు అనుసరిస్తున్న పంట మార్పిడి విధానాన్ని తెలుసుకున్నారు. అంకాపూర్ గురడిరెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు నల్ల చిన్న అనంత్‌రెడ్డి, కార్యదర్శి ఆలూర్ నారాయణరెడ్డి, కేకే భాజన్న, నర్సా రెడ్డి, వరంగల్ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ రాములు, ఏఈవో సవిత తదితరులు పాల్గొన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘననివాళి

కమ్మర్‌పల్లిలో బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల

జిల్లాకేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ధర్పల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

రుద్రూర్‌లోని ఫుడ్‌సైన్స్ కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బోధన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 27 : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల వారు, పద్మశాలీ కులస్తులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం ఉద్యమ సమయంలో తన మంత్రి పదవిని వదిలేశారని, బీసీల సంక్షేమం కోసం ఎంతో కృషిచేశారని కొనియాడారు.

కమ్మర్‌పల్లిలో కొండాలక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ...తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు రాజీలేని పోరాటాన్ని కొనసాగించిన వ్యక్తి బాపూజీ అని, ప్రతి తెలంగాణ వాది ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

బోధన్ పట్టణంలోని తట్టికోట్‌లోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో పద్మశాలీ సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాల్లో పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో, డిచ్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో, మోపాల్ ఎంపీడీవో కార్యాలయంలో, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, కమిషనరేట్ కార్యాలయంలో, రుద్రూర్‌లో చేనేతసహకార సంఘం ఆధ్వర్యంలో, ఫుడ్ సైన్స్ కళాశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. బాల్కొండ, ముప్కాల్, ఏర్గట్ల, రెంజల్, నందిపేట్, ఆర్మూర్, రెంజల్ తదితర మండలాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 27 : మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె బూమన్న, మండల అధ్యక్షుడు శేఖర్, సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సారంగాపూర్, సెప్టెంబర్ 27 : బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకుముందే ప్రకటించిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నగర శివారులోని ఖానాపూర్ గ్రామంలో రూ.2.10 కోట్లతో మెయిన్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చే పనులతో పాటు భాగ్యనగర్ కాలనీలో రూ.28 లక్షలతో సీసీ డ్రైనేజ్, విఠలేశ్వర కాలనీలో రూ.32 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసినసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లలితా గంగాధర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 'విజయ్' విద్యార్థులు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 27 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో జిల్లాస్థాయి యోగాపోటీలను గురువారం నిర్వహించగా.. నగరంలోని విజయ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బి.సాయితేజ (6వ తరగతి), జునేరా హుస్సేన్ (9వ తరగతి) ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత తెలిపారు. శుక్రవారం సదరు విద్యార్థులను అభినందించారు.

రేపు 250 విద్యాసంస్థలతో గురుపూజోత్సవం

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 27 : నిజామాబాద్ ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని బృందావన్‌గార్డెన్‌లో 250 ప్రైవేట్ విద్యాసంస్థలతో ఈనెల 29న గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిత్యానంద్, అరుణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో విద్యాసంస్థ నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 27 : మల్టీజోన్-1 పరిధిలో పలువురు సీఐలు బదిలీపై రాగా.. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ సీసీఆర్‌బీ సీఐగా ఉన్న జి. శ్రీనివాస్‌రాజ్ నగర సీఐగా, హైదరాబాద్ ఐజీ కార్యాలయంలో వెయిటింగ్ జాబితాలో ఉన్న బి.రఘుపతి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

దంత వైద్యశిబిరం

మోపాల్ (ఖలీల్‌వాడి),సెప్టెంబర్ 27 : మోపాల్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నగరంలోని శ్రీనూ నాయక్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత దంత శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ శ్రీనూ నాయక్ ఆధ్వర్యంలో వైద్యుడు కృష్ణమోహన్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు.

రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 27 : టీయూ భూములు కబ్జా కుట్రలను అరికట్టాలని, కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న టీయూ రిజిస్ట్రార్ యాదగిరిని సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. టీయూలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట శుక్రవారం నాయకుడు డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడారు. టీయూకి 574 ఎకరాల భూములను అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. టీయూ భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీయూ భూమి ప్రభుత్వ పర్యవేక్షణలోనే..

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 27 : టీయూకి చెందిన మొత్తం 578.02 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011లో సర్వే నంబర్ 334లో 50 ఎకరాల భూమిని తమ భూమి అని పలువురు కోర్టును ఆశ్రయించగా.. వాదనలు, ప్రతివాదనల అనంతరం 2024లో హైకోర్టు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపారు. టీయూ భూములకు సర్వే చేపట్టారని పేర్కొన్నారు. టీయూ భూమికి సంబంధించిన న్యాయ సంబంధమైన అంశాలన్నీ రెవెన్యూ విభాగ పర్యవేక్షణలనే ఉంటాయని, టీయూను అపఖ్యాతి పాలు చేసేలా దుష్ప్రచారం చేయవద్దని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయికి..

- సినీనటుడు ఆకాశ్ పూరి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటుడు ఆకాశ్ పూరి

కంఠేశ్వర్, సెప్టెంబర్ 27 : క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారని సినీ దర్శకుడు పూరిజగన్నాథ్ తనయుడు, నటుడు ఆకాశ్ పూరి అన్నారు. నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన డీఎస్ స్మారక క్రీడాపోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. కార్యక్రమానికి ఆకాశ్ పూరి ముఖ్యఅతిథిగా హాజరై, గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు డీఎస్ తనయుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నగదు పురస్కారం అందజేశారు.

జిల్లా సమాఖ్య 8వ వార్షిక సమావేశం

కంఠేశ్వర్, సెప్టెంబర్ 27 : కలెక్టట్‌లోని డీఆర్డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య 8వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఆర్డీఏ సాయాగౌడ్ మాట్లాడుతూ.. 2023-24లో నిజామాబాద్ జిల్లా సమాఖ్య రూ.37 లక్షల లాభంతో ఉండడం సమాఖ్య పనితీరుకు నిదర్శనమన్నారు. స్త్రీ నిధి రుణాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. 2023-24 జిల్లా సమాఖ్య ఆడిట్ నివేదిక, 2024-25 కార్యాచరణ ప్రణాళిక చదివి వినిపించారు. అదనపు డీఆర్డీవో రవీందర్, డీపీఎంలు, 28 మండలాల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కంఠేశ్వర్, సెప్టెంబర్ 27 : జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలను శుక్రవారం నిర్వహించారు. యువజన క్రీడల అధికారి ముత్తెన్న మాట్లాడుతూ.. వివిధ పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. జిల్లా నెహ్రూ యువకేంద్ర అధికారిణి శైలి బెల్లాల్, డీఐఈవో రవికుమార్, కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, సెప్టెంబర్ 27: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతున్నది. ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం రాత్రి 10 గంటల వరకు 51,420 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అంతేస్థాయిలో నీటికి దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ఒకరిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

సిరికొండ, సెప్టెంబర్ 27 : ఒకరిపై దాడిచేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పెద్దవాల్గోట్‌కు చెందిన సిందే రవితేజ.. గణపతి నిమజ్జన సమయంలో అదేగ్రామానికి చెందిన అఖిలేష్ తండ్రితో గొడవపడ్డాడు. దీనిని మనసులో ఉంచుకున్న అఖిలేష్.. తన స్నేహితులు కుశుల్, దీపక్, నితిన్‌తో కలిసి గురువారం సాయంత్రం రవితేజను పోత్నూర్ గ్రామశివారులోకి తీసుకెళ్లి కట్టెలు, పైపుతో కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడేండ్లుగా కుల బహిష్కరణ

- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

మాచారెడ్డి,సెప్టెంబర్ 27 : తమ కూతురు కులాంతర వివాహం చేసుకున్నదని తమను 2021లో కులబహిష్కరణ చేశారని మాచారెడ్డికి చెందిన బంగ్లా రాజేందర్‌గౌడ్ కుటుంబీకులు తెలిపారు. సంఘసభ్యులు తమ ఆస్తులపై దాడులుచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబాన్ని వెలివేసి దాదాపు మూడేండ్లు కావస్తున్నా గౌడ కులస్తులను ఎన్ని విధాలుగా బతిమిలాడినా, వేడుకున్నా కనికరం చూపడం లేదని, ఈ విషయమై గతంలో పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకపోయిందన్నారు. తమకు రూ.50 వేలు జరిమానా విధించగా.. ఈనెల 23న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాచారెడ్డి గౌడ సంఘం ఆస్తిలో తమకు భాగస్వామ్యం ఇప్పించి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

పాఠశాలలో బతుకమ్మ పండుగ

మోర్తాడ్, సెప్టెంబర్ 27: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ పండుగను నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి, పాటలు పాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. హెచ్‌ఎం ప్రభాకర్, బాలరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌రావు దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నవీపేట,సెప్టెంబర్ 27: ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీల సమస్యలను మూడు నాలుగు నెలల్లో పరిష్కరించేలా కృషి చేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈవో గణేశ్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్ మాట్లాడారు. పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో గణేశ్‌రావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో నూతన ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ నవీపేట మండల అధ్యక్ష కార్యదర్శులు భూమయ్య, శివకుమార్, ఆసంఘం నాయకులు హన్మారెడ్డి, భవంతి గోవర్ధన్, రాధ, జేదిత్య, రవీందర్‌రెడ్డి, నవీపేట, రెంజల్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోలో ప్రయాణికురాలి నుంచి గొలుసు లాక్కున్న డ్రైవర్, మహిళలు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 27 : ఆటోలో ఇద్దరు మహిళలు ఉన్నారన్న ధైర్యంతో వారితో కలిసి ప్రయాణించిన ఓ మహిళ నుంచి డ్రైవర్‌తో కలిసి బంగారు గొలుసును లాక్కొని, ఆటోలో నుంచి తోసేసిన ఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం ఒడ్డెటిపల్లి గ్రామానికి చెందిన ఆర్ల భూలక్ష్మి.. తన గ్రామానికి వెళ్లేందుకు నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఓ ఆటో రిక్షాలో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో మరో ఇద్దరు మహిళలు ఉండడంతో తోటి ప్రయాణికులు అనుకొని, ఎలాంటి అనుమానం లేకుండా ఆటోలో కూర్చున్నది. డ్రైవర్ కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డు నుంచి గౌతమ్‌నగర్ వైపునకు ఆటోను తీసుకెళ్లాడు.. డ్రైవర్‌తోపాటు ఆటోలోఉన్న ఇద్దరు మహిళలు భూలక్ష్మి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని, ఆటో రిక్షాలోంచి కిందికి నెట్టేసి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కంఠేశ్వర్, సెప్టెంబర్ 27 : జిల్లాకేంద్రంలోని నాగారం, డైట్ కళాశాల క్రీడా మైదానాల్లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా ఉమ్మడి జిల్లా కేడెట్లకు అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలను అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్ వివరించారు. 12 బెటాలియన్ ఎన్‌సీసీ కేడెటట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ఎడపల్లి, సెప్టెంబర్ 27: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీవో మన్‌మోహన్ శాస్త్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఓటరు సవరణ జాబితాను ప్రదర్శిస్తున్నారని, ఓటర్లు తమ పేర్లను చూసుకోవాలని కోరారు. అనంతరం ఏపీవో శ్రీవాణి మాట్లాడుతూ బోధన్ టీఎస్ఆర్‌టీసీకి చెందిన బస్సులు సాయంత్రం వేళ బస్టాండ్‌కు దూరంగా ఆపుతున్నారని అన్నారు. బోధన్ డిపో కంట్రోలర్ సుభాష్ స్పందిస్తూ బస్సు నంబర్‌తో సహా తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో డీటీ అనూష, ఎంఈవో సాయిలు, మెడికల్ ఆఫీసర్లు శాయాస్త ఫిర్దోజ, వెంకటేశ్వర్లు, ఏవో సిద్ది రామేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

కంఠేశ్వర్, సెప్టెంబర్ 27 : జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్స్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన బాలికలకు నేటి (శనివారం) నుంచి రెంజల్ జడ్పీహెచ్‌ఎస్‌లో, బాలురకు ఉప్పల్‌వాయి టీఎస్ రెసిడెన్షియల్ పాఠశాలలో శిక్షణ నిర్వహించి, తుది జట్టును రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, సీనియర్ పీడీ రాము, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడాపరికరాలు అందజేత

మోర్తాడ్, సెప్టెంబర్ 27: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రిబ్‌కో కంపెనీ వారు క్రీడాపరికరాలను వితరణగా చేశారు. వీటిని శుక్రవారం ప్రాఠశాలలో క్రిబ్‌కో జిల్లా సేల్స్ ఆఫీసర్ లక్ష్మీనారాయణరెడ్డి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, హెచ్‌ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 ట్రిప్పుల ఇసుక డంపులు సీజ్

పొతంగల్, సెప్టెంబర్ 27 : మండలంలోని బాకర్ ఫారం వద్ద గురువారం రాత్రి ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. మంజీరా రెండో బ్రిడ్జి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 60 ట్రిప్పుల ఇసుక డంపులను శుక్రవారం సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇసుక డంపులకు నేడు (శనివారం) తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామని, పాల్గొనేవారు రూ. 5 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

గ్రామ తాగునీటి సహాయకుల శిక్షణ ప్రారంభం

రెంజల్,సెప్టెంబర్ 27: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రెంజల్, ఎడపల్లి మండలాల తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులను బోధన్ డీఎల్పీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నినాయక్ ప్రారంభించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఏఈఈ గబ్బర్‌సింగ్, శిక్షకులు లక్ష్మీనారాయణ, చంద్రకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

చందూర్, సెప్టెంబర్ 27 : మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ప్రాంగణంలో ఉన్న పిల్ల కాలువలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చందూర్ పిల్ల కాలువ నుంచి శు